పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఆగస్టు 22 : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వేగంగా ఇవ్వడంతో పాటు అన్ని విధాలుగా సహకారం అందజేయనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సింగల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తక్షణమే అనుమతివ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన టీ ప్రైడ్ పథకం కింద 67 యూనిట్లు మంజూరు చేస్తూ కమిటీ తీర్మానించింది. ఐటీ హబ్‌కు సంబంధించి రెండు రోజుల్లో పూర్తి వివరాలు అందించాలని టీజీఐపీసీ జిల్లా మేనేజర్ నాగరాజును ఆదేశించారు. ఆటోనగర్‌కు సంబంధించిన నివేదికను శుక్రవారం సాయంత్రం లోగా ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సీతారాం, ఎల్డీయం బాపూజీ, సీపీఓ కిషన్, ఫైర్ ఆఫీసర్ జానయ్య, ఎంవీఐ ఆదిత్య, సీటీఓ యాదగిరి, మాధవి, బాబు, శంకర్ పాల్గొన్నారు.

తుంగతుర్తిలో పడగ విప్పుతున్న రౌడీ రాజకీయం

- బీఆర్ఎస్ శిబిరంపై కాంగ్రెస్ దాడి దానికి సంకేతమా..?
- గతంలో హత్యాకాండలతో అట్టుడికిన నియోజకవర్గం
- పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రశాంతంగా ప్రజలు

సూర్యాపేట, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : దశాబ్దాల పాటు దాడులు, ప్రతిదాడులు, హత్యలతో అట్టుడికిన తుంగతుర్తి నియోజకవర్గం పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మచ్చుకు ఒక అవాంఛనీయ ఘటన కూడా చోటు చేసుకోలేదు. కానీ నియోజకవర్గంలో మళ్లీ రాజకీయ కక్షలు, దాడులు పురివిప్పుతాయా అని ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం బీఆర్ఎస్ చేపట్టిన ధర్నా శిబిరంపై కాంగ్రెస్ మూకలు విచక్షణారహితంగా దాడికి దిగి విధ్వంసం సృష్టించడం అంటే రౌడీ రాజకీయాలకు సంకేతమా అని చర్చించుకుంటున్నారు. 2014 నుంచి 2023 వరకు తొమ్మిదిన్నరేండ్లపాటు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా గాదరి కిశోర్‌కుమార్ ఉండగా ఎలాంటి అల్లర్లు లేకుండా శాంతియుతంగా పాలన సాగింది. కానీ ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో తరుచూ దాడులు జరుగుతుండగా తాజాగా తిరుమలగిరిలో విధ్వంసానికి తెగబడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఐదు దశాబ్దాలుగా పార్టీల మధ్య పోరు

తుంగతుర్తి నియోజకవర్గం ఎంతో చారిత్రాత్మకమైనది. తెలంగాణ సాయుధ పోరాటంలో కీర్తికిరీటం అని చెప్పవచ్చు. భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, బండెనకబండి కట్టి పాట రచయిత యాదగిరితోపాటు ఎంతో మంది ఉద్ధండులకు నిలయం ఈ నియోజకవర్గం. దాదాపు ఐదు దశాబ్దాల కాలంలో ఈ నియోజకవర్గం హత్యా రాజకీయాలకు కేంద్రంగా మారింది. గత ఉమ్మడి రాష్ట్రంలో ఈ నియోజకవర్గం ఆర్థికంగా వెనుకబడింది. నీళ్లు లేక పంటలు పండక వందలు, వేల కుటుంబాలు వలసలు పోయారు. కొంత మంది నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం అనుచరులను సృష్టించుకొని చేతిలో రూపాయి పెట్టి కుటుంబం మొత్తాన్ని పోషించినట్లు రౌడీ రాజకీయాలు చేశారు. ప్రధానంగా ఇక్కడ కాంగ్రెస్, కమ్యూనిస్టు, తెలుగుదేశం పార్టీలు పాలన చేయగా ఆయా పార్టీల మధ్య పోరు అంతా ఇంతా ఉండకపోయేది. నిత్యం కొట్లాటలు, ఘర్షణలు, కత్తులు, తల్వార్లతో దాడులు వెరసి వందలాది హత్యలు, వేలాది మంది గాయాలపాలై కుటుంబాలు అస్తవ్యస్తంగా మారాయి. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేయడంతో ఇక్కడ ప్రజలకు చేతినిండా పని దొరికింది. జనం పక్కచూపు చూసే అవకాశం లేకుండా పోయింది. దీనికి తోడు తొమ్మిదిన్నరేండ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న గాదరి కిశోర్‌కుమార్ అనేక సార్లు బహిరంగంగానే ఎవరు దాడులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరికలు చేయడంతో ఒక్క సంఘటన కూడా చోటు చేసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాలంలో అక్కడక్కడ దాడులు జరుగుతూనే ఉన్నాయి.

ఎనిమిది నెలల్లో అనేక దాడులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలోనే గ్రూపులు, నియోజకవర్గంలో ఇసుక లొల్లి, కాంట్రాక్టుల గొడవతో పాటు తరుచూ దాడులు జరుగుతున్నాయి. అర్వపల్లి మండలం కాసర్లపహాడ్, తిరుమలగిరి మండలం కోమటిపల్లి గ్రామాల్లో ఇద్దరు వ్యక్తులపై దాడులకు పాల్పడడం, అనేక మందిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

బీఆర్ఎస్ మోతె మండలాధ్యక్షుడికి మాజీ మంత్రి పరామర్శ

మోతె, ఆగస్టు 22 : బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శీలం సైదులుయాదవ్ తండ్రి లింగయ్యయాదవ్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం నరసింహాపురం గ్రామానికి వెళ్లి లింగయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, గాదరి కిశోర్‌కుమార్, నాయకులు యుగంధర్‌రెడ్డి, నెమ్మాది భిక్షం, మారిపెద్ది శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, ఏలూరి వెంకటేశ్వరరావు ఉన్నారు.

విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ బీఎస్. లత

సీతారాంపురంలో పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ లత

బొడ్రాయిబజార్, ఆగస్టు 22 : మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్. లత హెచ్చరించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 25వ వార్డు సీతారాంపురంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. డెంగీ నివారణకు తీసుకుంటున్న చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డెంగీ వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో పారిశుధ్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇండ్లల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సీతారాంపురంలో డెంగీ కేసులు నమోదైన ప్రాంతాలను ఆమె పరిశీలించారు. పశువుల యజమానులు పరిశుభ్రత పాటించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట హెల్త్ అసిస్టెంట్ మస్కాపురం సురేశ్, వార్డు అధికారి మనోజ్, గౌసొద్దీన్, పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325792-All

PLOT FOR SALE
★హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీగా మహేశ్వరం, కందుకూరు, ముచ్చర్లలో ప్లాట్లు, విల్లాలు, ఇండ్లు అమ్మబడును. న్యూయార్క్, సింగపూర్‌లా శ్రీశైలం హైవే... Cont: 8008091512.
NT-332632

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777166 | చౌటుప్పల్ : 9182777638

రైతులందరి రుణం మాఫీ చేసే వరకు ఉద్యమం

- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్
- రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

కోదాడ ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడ, ఆగస్టు 22 : రైతులందరికీ రూ.2లక్షల రుణాలు మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు మాట మార్చి రైతులకు ద్రోహం చేస్తున్నదని, అందరికీ రుణమాఫీ జరిగే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 లోగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు కనీసం 50 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 8 నెలల పాలనలోనే అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. అనంతరం ఆర్డీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందిజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కవితా రామారావు, నాయకులు ఎస్‌కే నయీమ్, గట్ల కోటేశ్వరరావు, జానకి రామాచారి, జనార్దన్, పోరెల్ల సత్యనారాయణ, తొగరి రమేశ్, కాసాని మల్లయ్యగౌడ్, చలిగంటి వెంకట్ కర్ణ, సుందర్ బాబు, పొట్ట కిరణ్‌కుమార్, ఐతనమైన వెంకటేశ్వర్లు, మజార్, మాదాల ఉపేందర్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

మేళ్లచెర్వు : రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకున్న వారందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సూరిశెట్టి బసవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులు, రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బోగాల బాలవెంకటరెడ్డి, నాయకులు శంకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, రుక్కయ్య, రాజా పాల్గొన్నారు.

తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

మఠంపల్లి : రేషన్‌కార్డు నిబంధన లేకుండా పాస్‌పుస్తకం ఉండి రుణాలు తీసుకున్న రైతులందరికీ రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ మంగా రాథోడ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాణోతు జగన్‌నాయక్, మాజీ సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుందూరు వెంకటరెడ్డి, అశోక్‌నాయక్, గ్రంథాలయ మాజీ చైర్మన్ భద్రం రాజు, నాయకులు రామారావు, ఇరిగెల వెంకటరెడ్డి, నాగూనాయక్, కోటానాయక్, పిండిప్రోలు రామచంద్రయ్య, జాల కిరణ్, చిన్నపంగు రాజీవ్, గాయం గోవర్ధన్‌రెడ్డి, ఆరాల నాగరాజు, కస్తాల మట్టయ్య, రంగానాయక్, జయరాజు పాల్గొన్నారు.

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

పాలకవీడు : రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి ఆధ్వర్యంలో తాసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాగిరెడ్డి, లక్ష్మారెడ్డి, నాగుల్‌మీరా, లక్ష్మీనారాయణ, అశోక్, వెంకట్, అలీ, సిద్ధు, ప్రశాంత్, రాజు, తరుణ్ పాల్గొన్నారు.

గరిడేపల్లిలో ధర్నా

నేరేడుచర్ల(గరిడేపల్లి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గరిడేపల్లి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గుగులోతూ కృష్ణానాక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, సీనియర్ నాయకుడు కేవీఎన్ రెడ్డి, సర్వారం పీఏసీఎస్ చైర్మన్ వీరం రెడ్డి శంభిరెడ్డి, నాయకులు కీతా రామారావు, గుత్తికొండ వెంకటరమణా రెడ్డి, మాశెట్టి శ్రీహరి, బానోత్ వెంకటేశ్వర్లు, శోభన్ బాబు, ప్రధాని సైదులు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, నగేశ్ పాల్గొన్నారు.

చింతలపాలెం : మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తాసీల్దార్ సురేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మధిర సత్యనారాయణరెడ్డి, మాజీ అధ్యక్షుడు మోర్తాల వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ కొత్తమద్ది వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాల్వెండి శ్రీనివాసరావు, నాయకులు శేషు, మైబెల్లి, శ్రీనివాస్, గోవిందరెడ్డి, అంకిరెడ్డి, సత్యానందం, ఎన్‌టీఆర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జోశ్, బ్రహ్మం, వీరారెడ్డి, సైదులు, అంజి, లింగయ్య, శ్రీను, భిక్షం, సత్యం, రైతులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి

సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే మాట నిలబెట్టుకోవాలి

- బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి

నేరేడుచర్ల : సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానంటూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నేరేడుచర్ల తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి వాటిని అమలు చేయలేక పూటకో నాటకం ఆడుతున్నాడని విమర్శించారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు ఎగనామం పెట్టిందని, అనేక కొర్రీలు పెట్టి వేలాది మంది రైతుల నోట్లో మట్టి కొట్టిందని పేర్కొన్నారు. తమ రుణాలు మాఫీ కాక పోవడంతో రైతులు వ్యవసాయ పనులు మాని బ్యాంకులు, ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రైతులకు ఎలాంటి షరతులు విధించకుండా రూ. 2లక్షల వరకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ రైతులు, ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. అనంతరం తాసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందించారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, నేరేడుచర్ల, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నాగండ్ల శ్రీధర్, కడియం వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీలు లకుమళ్ల జ్యోతిభిక్షం, చెన్నబోయిన సైదులు, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లబోయిన లింగయ్య, ఉపాధ్యక్షుడు సుదర్శన్, నాయకులు పిచ్చిరెడ్డి, రాంరెడ్డి, రాములు, నవీన్, మురళి, నాగార్జున, రామస్వామి, శ్రీరామ్మూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, ఇంతియాజ్ , శ్రీను, రాము, మల్లారెడ్డి, వినాయకరావు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన రేవంత్ సర్కారు

హుజూర్‌నగర్ : రుణమాఫీ పేరుతో రైతులను రేవంత్ సర్కారు మోసం చేసిందని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం హుజూర్‌నగర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. డీఏఓ రాజేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, ఎంపీటీసీ రాజారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నాగేశ్వర్‌రావు, నాయకులు అమర్, కేవీఎన్ రెడ్డి, అలీ, అన్నెం కొండారెడ్డి, ఉపేందర్, పరశురాం, భాస్కర్‌రెడ్డి, నబీ, మునీర్, సైదేశ్వర్‌రావు, రాంబాబు, గోపీ, భిక్షం, మల్లేశ్ పాల్గొన్నారు.

సూర్యాపేట : ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, నాయకులు

మేళ్లచెర్వు : రైతులందరికీ రుణమాఫీ చేయాలని తాసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మఠంపల్లి : తాసీల్దార్ మంగా రాథోడ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

పాలకవీడు : తాసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చింతలపాలెం : తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

గరిడేపల్లి : తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పరిశ్రమల్లో పచ్చని వాతావరణం ఉండేలా చూడాలి

- డీఎంహెచ్ఓ కోటాచలం

వన మహోత్సవంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ కోటాచలం

సూర్యాపేట రూరల్, ఆగస్టు 22 : పరిశ్రమల్లో ఎల్లప్పుడూ పచ్చని, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ కోటాచలం అన్నారు. గురువారం పట్టణంలోని సువెన్ ఫార్మస్యూటికల్ కంపెనీలో నిర్వహించిన వనమహోత్సవంలో పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ పీఎస్ఎన్ మూర్తితో కలిసి ఆయన పాల్గొని మొక్కలు నాటారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలు తమ ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం 50 మంది కంపెనీ ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కంపెనీ యాజమాన్యం రమేశ్‌బాబు, రమణ, జగపతిరాయుడు, నాగరాజు, భరత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు, పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

మోతె, ఆగస్టు 22 : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డులోని శ్రీనివాస్ ఫంక్షన్‌హాల్లో జరుగుతున్న సంఘం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా నేటికి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించలేదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, జిల్లా ఉపాధ్యక్షులు కడెం కుమార్, సోమపంగా జానయ్య, మండల కార్యదర్శి కిన్నెర పోతయ్య, రైతుసంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంపై మహిళా రైతులకు అవగాహన

మేళ్లచెర్వు, ఆగస్టు 22 : మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మేళ్లచెర్వు మండల మహిళా రైతులకు గురువారం పాడిపశువులు, పెరటికోళ్ల పెంపకంపై మండల పశువైద్యాధికారి ఉషారాణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు కృష్ణమోహన్, మేరి, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ లలిత పాల్గొన్నారు.

31 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

నేరేడుచర్ల(గరిడేపల్లి) ఆగస్టు 22 : ఈ నెల 31 నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి బాల, బాలికల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చత్రునాయక్ తెలిపారు. గురువారం గరిడేపల్లి ఎమ్మార్సీ భవన్‌లో క్రీడల నిర్వహణపై వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలస్థాయి అండర్ -14, అండర్ -17 బాల బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31న గరిడేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో కబడ్డీ పోటీలు, సెప్టెంబర్-3న పొనుగోడు జడ్పీహెచ్ఎస్‌లో ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలు జరుగుతాయన్నారు. బాల, బాలికలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. సమావేశంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి హుస్సేన్, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు రాంప్రసాద్, సైదిరెడ్డి, అంబేద్కర్, ధనమ్మ, ప్రమీల, బాబు, ప్రదీప్‌కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నాగారం మండలంలో..

నాగారం : ఈ నెల 30, 31 తేదీల్లో నాగరం మండల ఎస్‌జీఎఫ్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బాలూనాయక్ తెలిపారు. గురువారం సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫణిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న బాలికలకు, 31న బాలురకు పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు ఉదయం 9గంటల వరకు రావాలని సూచించారు.

నేడు వాహనాల వేలం

కోదాడ రూరల్, ఆగస్టు 22: పలు కేసుల్లో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న వాహనాలకు శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శంకర్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఉదయం 9 గంటల వరకు కార్యాలయంలో డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గోశాలను ధ్వంసం చేసిన వ్యక్తిపై ఎస్పీకి ఫిర్యాదు

కోదాడ రూరల్, ఆగస్టు 22: మండలంలోని కూచిపూడి గ్రామంలోని గోశాలను ధ్వసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ మాజీ సర్పంచ్ శెట్టి సురేశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. దాంతో పాటు గ్రామ శివారులోని అంతరగంగా వాగుపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు చంద్రయ్య, రమేశ్, పెద్దలు పాల్గొన్నారు.

మేళ్ల చెర్వు శివాలయంలో షాపుల నిర్వహణకు బహిరంగ వేలం

మేళ్లచెర్వు, ఆగస్టు 22 : స్థానిక శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఏడాది పాటు కొబ్బరికాయలు, పూజాసామగ్రి, ప్రసాద విక్రయ హక్కుల కోసం గురువారం ఆలయ ఆవరణలో మిర్యాలగూడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించారు. దామరచర్లకు చెందిన రాజు టెంకాయలు, పూజాసామగ్రి విక్రయానికి రూ.2 లక్షలు, ప్రసాదాల విక్రయానికి రూ.1.7 లక్షలకు వేలాన్ని దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి , ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, సభ్యులు శ్రీను, శంభయ్య, కమలారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం


ఉద్యోగులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నేరేడుచర్ల(గరిడేపల్లి) ఆగస్టు 22 : గరిడేపల్లి మండలం మంగాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయిబాబా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు భిక్షం వేరే గ్రామానికి బదిలీ కాగా గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పేరబోయిన మల్లేశ్వరీవెంకన్న, మాజీ ఉప సర్పంచ్ ధరావత్ నిర్మలా జగ్గు, మాజీ వార్డు సభ్యుడు కృష్ణమూర్తి, ఏఎస్ఐ లింగయ్య, నాయకులు అంజయ్య, సైదులు, వెంకటేశ్వర్లు, రాముడు, నాగరాజు, లింగయ్య, వెంకటయ్య, గోపి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ, అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరు

నేరేడుచర్ల, ఆగస్టు 22 : హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం ఎన్‌ఆర్జీఎస్ నిధుల నుంచి రూ. 11 కోట్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నియోజకవర్గాల్లో మొత్తం 28 గ్రామపంచాయతీ భవనాలు, 45 అంగన్‌వాడీ భవనాలను నిర్మించనున్నారు. వీటిలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 11 గ్రామ పంచాయతీలు, 11 అంగన్‌వాడీ భవనాలు, కోదాడ నియోజకవర్గంలో 17 గ్రామ పంచాయతీలు, 34 అంగన్‌వాడీ భవనాలను కొత్తగా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కొక్క గ్రామపంచాయతీకి రూ. 20 లక్షలు చొప్పున, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12లక్షలు చొప్పున నిధులు కేటాయించారు.